క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్‌ఐ శంకర్

పెద్ద శంకరంపేట (మెదక్): పెద్దశంకరంపేట శివారులో గత నెల 24న ఆరేపల్లి గ్రామానికి చెందిన శ్రీశైలం తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అతడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ శంకర్ సీఈఐఆర్ ద్వారా అతని సెల్‌ఫోన్ వివరాలు సేకరించి ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించారు. ప్రజలు తమ సెల్ ఫోన్లు పోగొట్టుకుంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ సూచించారు.

రెండురోజుల్లో యూనిఫాంలు అందించండి

డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు



యూనిఫాంను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు

తూప్రాన్: విద్యార్థుల యూనిఫాంలను రెండు రోజుల్లో అందించాలని డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు అధికారులను ఆదేశించారు. మండలంలోని ఐకేపీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. కార్యాలయంలో విద్యార్థుల యూనిఫాంల ప్యాకింగ్‌ను పరిశీలించారు. త్వరగా పూర్తిచేయాలని మహిళలకు సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గడువులోగా పాఠశాలలకు అందజేస్తామని ఐకేపీ ఏపీఎం రుక్మిణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రమైన మనోహరాబాద్ 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం మరమ్మతులు చేయనున్నట్లు ఏఈ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దానిలో భాగంగా సోమవారం ఉదయం 8 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. మనోహరాబాద్, ముప్పిరెడ్డిపల్లి, కూచారం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

శివ్వంపేట(నర్సాపూర్)లో..

పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ దుర్గప్రసాద్ తెలిపారు. సికింద్లాపూర్, గోమారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు గమనించాల్సిందిగా కోరారు.

వేతనాలు చెల్లించాలి

పంచాయతీ కార్మికుల నిరసన

శివ్వంపేట(నర్సాపూర్): వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధి రత్నపూర్ పంచాయతీ కార్మికులు ఆదివారం విధులు బహిష్కరించి కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. 4 నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు రాజయ్య, ప్రభాకర్, ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలు సైతం సక్రమంగా ఇవ్వకపోడంతో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని వాపోయారు. వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీకి ఆదాయ మార్గాలు లేకపోవడంతో కార్మికుల వేతనాల చెల్లింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపీఓ తిరుపతిరెడ్డి అన్నారు. త్వరలోనే వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యుత్ వైర్ల దొంగలను పట్టుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): వ్యవసాయ బోరు బావుల వద్ద నుంచి విద్యుత్ తీగెలు చోరీ చేస్తున్న దొంగలను పట్టుకునేందుకు తండావాసులు శనివారం రాత్రి కాపుకాచారు. వారం రోజుల క్రితం మండల పరిధి నాను తండాలోని 15మంది రైతుల వ్యవసాయ బోరుబావుల వద్ద ఉన్న వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. శనివారం రాత్రి ఓ బోరు వద్ద గుర్తుతెలియని వ్యక్తులు వైర్లను దొంగలిస్తుండగా తండావాసులు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు వెంబడించగా పారిపోయారని రైతులు తెలిపారు. దొంగల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోయారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి దొంగలను పట్టుకోవాలని కోరారు.

ప్రమాదాలకు నెలవు మర్రిచెట్లు

హైవే పక్కన ఉన్న మర్రిచెట్లు ప్రయాణికులకు ప్రాణాంతకంగా మారాయి. జాతీయ రహదారి పక్కన సైడ్ రైలింగ్ లోపలి వైపు రోడ్డుపై చెట్లు ఉండడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మెదక్, హైదరాబాద్ 765డి జాతీయ రహదారిపై కౌడిపల్లి నుంచి కొల్చారం వెళ్లేదారిలో కౌడిపల్లి శివారులోని అటవీప్రాంతంలో జాతీయ రహదారి పక్కన రోడ్డుకు ఆనుకుని మర్రిచెట్లు ఉన్నాయి. వీటివల్ల తరచూ వాహనదారులు మృత్యువాత పడుతున్నారు.

– కౌడిపల్లి(నర్సాపూర్)

- హైవే పక్కన భారీ వృక్షాలు
- ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు



కౌడిపల్లి హైవే పక్కన ప్రమాదకరంగా ఉన్న మర్రిచెట్లు

హైవేపై సుమారు రెండు కిలో మీటర్ల పరిధిలో 14పైగా మర్రిచెట్లు ఉండంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రెండు రోజుల క్రితం కొల్చారం గ్రామానికి చెందిన ఓ విలేకరి జాతీయ రహదారిపై తన బైక్‌పై రోడ్డు పక్క నుంచి వెళుతుండగా బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న మర్రిచెట్టును ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. గతంలో సైతం కౌడిపల్లికి చెందిన యువకుడు బైక్ చెట్టును ఢీకొడంతో ప్రాణాలు కోల్పోయాడు. అంతే కాదు పలు బైక్‌లు, కార్లు అదుపుతప్పి ఆ చెట్లను ఢీకొనడంతో ప్రమాదాలకుగురై మృతి చెందిన ఘటనలు చాలానే ఉన్నాయి. ఇక రాత్రి పూటైతే మరింత ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చెట్టును ఢీకొనడంతో మృతి చెందిన విలేకరి(ఫైల్)



వడియారం రైల్వే స్టేషన్

వడియారంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాప్

చేగుంట(తూప్రాన్): ఇటీవల ప్రారంభమైన రెండు వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మండల కేంద్రమైన చేగుంటలోని వడియారం రైల్వే స్టేషన్‌లో ఆగేందుకు అనుమతి ఇచ్చారు. కాచిగూడ నుంచి రాజస్థాన్‌లోని బికనేర్‌కు వెళ్లే లాల్‌ఘర్ ఎక్స్‌ప్రెస్ ఈ రైల్వేస్టేషన్‌లో ఒక నిమిషం పాటు ఆగుతుంది. ప్రతి శనివారం కాచీగూడ నుంచి వెళ్లే ఈరైలు రాత్రి 10:50కు వడియారం స్టేషన్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గురువారం ఉదయం 6:06 నిమిషాలకు వడియారం స్టేషన్ చేరుకొని నిమిషం పాటు ఆగి కాచిగూడకు వెళుతుంది. ఈ రైలు తెలంగాణ నుంచి మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ వెళ్లే ప్రయాణీకులకు సౌకర్యవంతంగా ఉండనుంది. ఇదే రూట్లో మరో వీక్లీ హిసార్ ఎక్స్‌ప్రెస్ ఐదు రాష్ట్రాల మీదుగా ప్రయాణించనుంది. గురువారం కాచిగూడ నుంచి బయలుదేరి సాయంత్రం 4:30కు వడియారం స్టేషన్‌కు చేరుకుని రెండు నిమిషాల పాటు ఆగుతుంది. ఈరైలు తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ మీదుగా హర్యానాలోని హిసార్ జంక్షన్‌కు చేరుకుంటుంది. ఈ రెండు వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వడియారం స్టేషన్‌లో నిలపడంతో సమీప పట్టణాల నుంచి ఐదు రాష్ట్రాలకు చేరుకునే ప్రయాణీకులకు సౌకర్యంగా మారనుందని వడియారం రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ మెంబర్ గణేశ్ రవికుమార్ పేర్కొన్నారు.

నిరుపయోగంగా అతిథి గృహం



నిరుపయోగంగా ఉన్న అతిథి గృహం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం వద్ద భక్తుల సౌకర్యార్థం పర్యాటక శాఖ రూ.లక్షలు వెచ్చించి గెస్ట్ హౌస్ నిర్మించింది. నిర్వహణ బాధ్యత ఎవ్వరూ తీసుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. 2005 జనవరి 12న అప్పటి ప్రభుత్వం గెస్ట్ హౌస్ నిర్మాణానికి రూ. 25 లక్షలు మంజూరు చేసింది. నాటి మంత్రి గీతారెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే సంవత్సరంలో అన్ని హంగులతో భవన నిర్మాణం పూర్తి చేశారు. వసతుల కల్పనకు మరిన్ని నిధులు వెచ్చించారు. భవనం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ప్రారంభించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. గ్రామస్తుల వినతి మేరకు ఆరేళ్ల క్రితం హరీశ్‌రావు మరిన్ని నిధులు మంజూరు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

తౌర్యనాయక్ సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ ఉద్యమంలో నార్సింగి పీఏసీఎస్ మాజీ చైర్మన్ తౌర్యనాయక్ అందించిన సేవలు మరువలేనివని జెడ్పీటీసీ కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం నర్సంపల్లి తండాలో తౌర్యనాయక్ ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా తౌర్యనాయక్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుమ్మరి బాబు, చత్రియ నాయక్, మల్లేశంగౌడ్, రాజేందర్‌రెడ్డి, భూపతిరాజు, బాషానాయక్ పాల్గొన్నారు.

కంచన్‌పల్లిలో బడిబాట..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లిలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఉపాధ్యాయుడు బాలశేఖర్ తదితరులు గ్రామంలో ఇంటింటికీ తిరిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు, నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామస్తులను కోరారు.



వివరిస్తున్న ఉపాధ్యాయుడు బాలశేఖర్

బీజేపీ శ్రేణుల సంబురాలు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో నార్సింగి మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. ఆదివారం రాత్రి నార్సింగి శివాజీ చౌక్ వద్ద టపాసులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, నరేష్, గురుపాదం, శిర్న శ్రీనివాస్ ఉన్నారు.

పాపన్నపేట(మెదక్)లో..

ప్రధానిగా మూడోసారి నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని పాపన్నపేటలో బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు బీకొండ రాములు, నాయకులు పెద్ద కిష్టయ్య, ఇమ్మాన్యుయేల్, సంజీవులు, నరేష్, చంద్రన్న, దుర్గాప్రసాద్, సాయిలు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం మోహన్‌రెడ్డి

- మహంకాళి ఆలయ ట్రస్టీ పాండురంగాచారి

రామాయంపేట(మెదక్): ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి అందరికీ ఆదర్శమని స్థానిక మహంకాళి ఆలయ ట్రస్టీ పాండురంగాచారి పేర్కొన్నారు. ఈఓ మోహన్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఆదివారం రామాయంపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఓ సమర్థవంతంగా తమ విధులు నిర్వర్తించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు.ని ఆయనన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీపీ మోహనాచారి, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

- ఎంపీ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఖేడ్ జూనియర్ కళాశాలలో ఆదివారం 2001–2004 సంవత్సరపు పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, చదువును నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. అన్ని సదుపాయాలు ఉన్న ప్రభుత్వ బడుల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని కోరారు. ఖేడ్ కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్ కృషితో విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించారని గుర్తు చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు గ్రంథాలయంలో తగు సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. అనంతరం టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్ రెడ్డి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, వైస్ ఎంపీపీ పండరి యాదవ్, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు



ఎన్‌సీసీ క్యాడెట్ల సాంస్కృతిక ప్రదర్శన

ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు పెంపుతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంగారెడ్డి బెటాలియన్ ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందని, తమ ప్రతిభను చాటుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు ఎన్‌సీసీ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించగా, క్యాంప్ డిప్యూటీ కమాండెంట్ కెప్టెన్ డాక్టర్ భవానీ క్యాడెట్లకు ఇచ్చిన శిక్షణ, శిబిర నివేదికను అందించారు. సంగారెడ్డి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పార్థసారధి నందా సతీమణి ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ చిన్నయిదత్త హాజరై క్యాడెట్లకు పలు సూచనలు చేశారు. శిక్షణ ముగింపు సందర్భంగా క్రీడా విజేతలకు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి, ఉత్తమ సేవలందించిన క్యాడెట్లకు పతకాలు ప్రదానం చేశారు. మున్సిపల్ సిబ్బందికి పార్థసారధి నందా కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాం



స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్, కార్మికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. తెల్లాపూర్‌లో స్వచ్ఛత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేళ్ల చెరువు పరిసరాలను మున్సిపల్ సిబ్బంది, తెల్లాపూర్ నైబర్‌హూడ్ గ్రీన్‌ఆర్మీ సంయుక్తంగా కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రజలల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మంజుల, తెల్లాపూర్ నైబర్‌హూడ్ ఆసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ, గ్రీన్‌ఆర్మీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామానాయుడు

న్యాల్‌కల్(జహీరాబాద్): వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు అన్నారు. మండల పరిధిలోని హద్నూర్‌లో ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలను నడుపొద్దన్నారు. పరిమిత వేగంతో వాహనాలను నడపాలని, ప్రయాణికుల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అ'పూర్వ' సమ్మేళనం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గోమారం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2002–03బ్యాచ్‌కు చెందిన వారంతా గోమారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించి అప్పటి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పూర్వ విద్యార్థులు అశోక్, వెంకటేశ్, జనార్దన్‌రెడ్డి, ఆంజనేయులు, భాస్కర్, శ్రీనివాస్, సురేందర్, నాగరాణి, జ్యోతి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

శ్రీరేణుక మాత గార్డెన్‌లో..

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని శ్రీరేణుక మాత గార్డెన్‌లో 1998–99 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ 25సంవత్సరాల తర్వాత అందరు ఒకచోట కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, రాజిరెడ్డి, మహిపాల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గెట్ టు గెదర్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట జెడ్పీపాఠశాల 1999బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల అవరణలో గెట్ టు గేదర్ కార్యక్రమం నిర్వహించారు. ఇరవై ఐదేళ్లు నిండిన సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒక చోటచేరి సంబురాలు చేసుకున్నారు. చిన్ననాటి ముచ్చట్లు నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో మధుసూదన్‌గౌడ్, దనమత్రి, యూసుప్, సంతోష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



గోమారంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



చందంపేట జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు



నిజాంపేటలో 1998-99బ్యాచ్ విద్యార్థులు